# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు



WANTED విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745





సంపుటి : 01 | సంచిక : 186 | వరంగల్ | ఆదివారం, 12 ఏప్రిల్ 2026 | పేజీలు : 02




# అటు ఆకస్మిక తనిఖీలు ..
# ఇటు నిరంతర సమీక్షలు

(ధీరావత్ శ్రీను నాయక్, సీనియర్ జర్నలిస్టు)

- నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యమే ప్రధాన లక్ష్యం
- ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ
- జనగామ జిల్లా అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక శైలి

జనగామ జిల్లా అభివృద్ధిలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనదైన ముద్ర చూపిస్తున్నారు. పరిపాలనలో పారదర్శకత, సమన్వయం, మానవీయ దృక్పథం కలగలిపి ప్రజలకు చేరువై సరైన పాలనను అందిస్తున్నారు. కలెక్టర్ జిల్లా పరిపాలనలో ప్రజలకు నమ్మకాన్ని అందిస్తున్నారు. ప్రజావాణిలో అర్జీదారుల సౌకర్యార్థం కుర్చీని ఏర్పాటు చేసి, వారి వినతులను కలెక్టర్ తానే స్వయంగా స్వీకరిస్తూ, ఫిర్యాదులను విని, క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులను వెంటనే స్పందించేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రతి అర్జీపై శ్రద్ధ చూపుతూ, వేగవంతమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు.

**సమయపాలనలో అందరినీ ఏకతాటిపైకి**

పరిపాలనలో సమయపాలనకు కలెక్టర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. అధికారులు, ఉద్యోగులు సమయానికి విధులకు హాజరై, బాధ్యతాయుతంగా పనిచేయాలనే దిశగా పలు మార్గదర్శకాలను పక్కాగా (ఫేషియల్ అటెండెన్స్) అమలు చేశారు. వివిధ శాఖల కార్యాలయాల్లో పెండింగ్ ఫైల్ ల ఆలస్యాలను తగ్గించి, పనుల వేగాన్ని పెంచేలా చర్యలు తీసుకున్నారు.

**మైనింగ్, ఇసుక పై కలెక్టర్ ఉక్కుపాదం**

జిల్లాలో అక్రమ మైనింగ్‌పై కలెక్టర్ ఉక్కుపాదం మోపుతున్నారు. అనుమతులు లేకుండా జరుగుతున్న తవ్వకాలను అరికట్టేందుకు నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, కఠిన చర్యలు తీసుకుంటూ, ఆంక్షలు విధిస్తున్నారు. అక్రమ ఇసుక, గ్రావెల్ తవ్వకాలపై కలెక్టర్ ఉక్కుపాదం మోపుతున్నారు. తహసీల్దార్లు ఇచ్చే మాన్యువల్



కూపన్లను పూర్తిగా రద్దు చేసి, అన్ని అనుమతులను ఆన్‌లైన్ విధానంలోకి మార్చారు.

**విద్య, వైద్య రంగాల్లో ఆకస్మిక తనిఖీలు**

జిల్లాలో విద్య, వైద్య రంగాల మెరుగుదల కోసం కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పాఠశాలలు, ఆసుపత్రుల్లో ఉదయం 8 గంటలకే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, సేవల నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులకు సరైన బోధన, మధ్యాహ్న భోజనం, పది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ప్రతిభ కనబరిచే విధంగా ప్రోత్సహిస్తూ, ఉపాధ్యాయులకు సూచనలు చేస్తూ, తానే స్వయంగా విద్యార్థులకు సులభ పద్ధతులచే బోధనలు చేస్తూ, అలాగే ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన చికిత్స అందుతున్నాయా అనే అంశాలను స్వయంగా పరిశీలిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఆప్యాయంగా విని పరిష్కరించడంలో కలెక్టర్ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. తక్కువ సమయంలోనే తన పని తీరు ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని, జనగామ జిల్లా అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే
# జయంతి వేడుకలు

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహనీయుడు జ్యోతిరావు పూలే గారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి గారు పాల్గొని జ్యోతిరావు పూలే గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే గారు సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ కోసం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు. మహిళా విద్యకు, దళితుల హక్కులకు ఆయన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అలాగే సమాజంలో సమానత్వం, న్యాయం నెలకొల్పేందుకు జ్యోతిరావు పూలే గారి ఆలోచనలు నేటికీ ప్రాసంగికమని, ఆయన చూపిన మార్గంలో నడవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జ్యోతిరావు పూలేకు నివాళులు అర్పించారు.



## ఎంపీ వేం నరేందర్ రెడ్డిని కలిసిన
# టీఎస్ జేయూ నేతలు

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని టీఎస్ జేయూ రాష్ట్ర అధ్యక్షుడు నారగౌని పురుషోత్తం గౌడ్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను విన్న ఆయన పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో టీఎస్ జేయూ నేతలు మెరుగు చంద్రమోహన్, పాపని నాగరాజు, ముత్యం ముఖేష్, అశోక్, ఈద శ్రీధర్, ఉప్పలంచి నరేందర్, పోచంపల్లి రజిత తదితరులు ఉన్నారు.



# అంగన్వాడి టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ



**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్వాడి టీచర్లకు శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. MLA మాట్లాడుతూ.. అంగన్వాడి వ్యవస్థ చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. టీచర్లు గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే ప్రధాన వంతెనలని పేర్కొన్నారు. వారికి సాంకేతిక సదుపాయాలు కల్పించడం ద్వారా సేవలను మరింత సమర్ధవంతంగా అందించగలరని చెప్పారు. స్మార్ట్ ఫోన్‌ల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల వివరాలను సమయానుకూలంగా నమోదు చేయడం, పోషణ, ఆరోగ్య సంబంధిత సేవలను పర్యవేక్షించడం సులభమవుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడి సేవలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా అమలు అవుతాయని తెలిపారు. అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన ఈ స్మార్ట్‌ఫోన్‌లు తమ పనిని సులభతరం చేస్తాయని, సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు ఉపయోగపడతాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడి సిబ్బంది మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గారు అందరికీ అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా అంగన్వాడి వ్యవస్థ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



# రేషన్ షాపులు తనిఖీ చేసిన డీటీఎస్

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** పాలకుర్తి మండలంలో పలు రేషన్ షాపులను కొడకండ్ల డిటిఎస్ లచ్చు నాయక్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పాలకుర్తి మండల కేంద్రంలో రేషన్ షాపులను తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. స్టాక్ రికార్డు, ధరలు పట్టికలను, పరిశీలించారు. ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యం అందిస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులు తీసుకెళుతున్న తీరును పరిశీలించారు. మూడు నెలల బియ్యం మూడుసార్లు వేలిముద్ర వెయ్యవలసి వస్తుందని, సమయపాలన పాటించి సరుకులు తీసుకువెళ్లాలని సూచించారు. రేషన్ షాపుల్లో తప్పనిసరిగా ధరల పట్టిక, స్టాకు రికార్డులు ఏర్పాటు చేసుకోవాలని రేషన్ డీలర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండలం రేషన్ డీలర్ల వర్కింగ్ ప్రెసిడెంట్ కమ్మగాని రమేష్ గౌడ్, డీలర్లు ఉన్నారు.



# నేడు బహుజన కవి సమ్మేళనం

**జనగామ, పాలకుర్తి వాణి :** మహాత్మా జ్యోతిరావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్, భారత మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబు జగ్జీవన్ రామ్ మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బహుజన కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, అంబేడ్కర్ సేవా పురస్కార గ్రహీత, దళిత రత్న కన్నారపు శివశంకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని ఏబీవీ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు కవి సమ్మేళనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కుల నిర్మూలనసమ సమాజం స్థాపన అనే అంశంపై కవులు, రచయితలు, కళాకారులు తమ కవితలు గానం చేస్తారని తెలిపారు. జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** ఐకెపి ఆధ్వర్యంలో అయ్యంగారిపల్లి ,ముత్తారం, మంచుప్పుల , మైలారం ,లక్ష్మి నారాయణపురం , తీగారం గ్రామాలలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ లావుద్య మంజుల భాస్కర్ నాయక్, ప్రారంభించారు.వైస్ చైర్మన్ మల్లారెడ్డి ,సర్పంచ్ లు ముస్కు సుధాకర్, బోలగాల కల్పన, బోడిగే ప్రదీప్, కారు పోతుల శ్రీనివాస్ గౌడ్ గుగులోత్ విమల, చింతకింది అనిత, బేతి కుమార స్వామి, పాలకుర్తి ఎంపీడీవో రవీందర్ , ఏపిఎం కారు పోతుల వెంకటేశ్వర్లు గౌడ్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు,విరమనేని యాకాంతరావు,MD మదర్,వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, సీసీలు అనురాధ, శోభ, యాదగిరి, ఉమా.SLN ఫంక్షన్ హాల్ మేనేజర్ వినయ్,AEO లు వెంకటేష్, మహేష్, వివోఏలు పాల్గొన్నారు.



# పూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధి

**జనగామ, పాలకుర్తి వాణి:** పూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి వెలిగించి, పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, సిబ్బంది కూడా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు సమర్పించారు.



# బచన్నపేట ఎస్సైపై బదిలీ వేటు

**పాలకుర్తి వాణి, బచ్చన్నపేట :** అవినీతి ఆరోపణల అభియోగాల నేపథ్యంలో బచ్చన్నపేట ఎస్సై హమీద్‌పై బదిలీ వేటు పడింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు అటాచ్ చేస్తూ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.




హనుమకొండ బార్ అసోసియేషన్

# అధ్యక్షుడిగా రామకృష్ణ

**పాలకుర్తి వాణి, హనుకొండ :** హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా రఘునాథపల్లి మండలం, ఖిలా షాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది చోల్లేటి రామకృష్ణ విజయం సాధించారు. సభ్యుల మద్దతుతో ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చోల్లేటి రామకృష్ణ గారు తమ స్వగ్రామమైన ఖిలా షాపూర్ నుండి ఎదిగి, న్యాయవాద వృత్తిలో ఎంతో మందికి అండగా నిలుస్తూ విశేష గుర్తింపు పొందారు. ఇప్పుడు జిల్లా స్థాయి బార్ అసోసియేషన్ బాధ్యతలు చేపట్టడం పట్ల రఘునాథపల్లి మండల ప్రజలు, న్యాయవాద మిత్రులు మరియు స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341